ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
మార్చి 5, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com



## అంబులెన్సులో సుఖప్రసవం

**లింగంపేట్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

లింగంపేట్ మండలం రాంపల్లి గ్రామానికి చెందిన శైలజకు ఆకస్మాత్తుగా ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను బాన్సువాడలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా రక్తపోటు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ క్రమంలో 108 అంబులెన్సులో కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే శైలజకు నొప్పులు తీవ్రంగా పెరిగి అత్యవసర పరిస్థితి నెలకొంది. దీంతో ఈఎంటీ లక్ష్మణ్ సమయస్ఫూర్తితో అంబులెన్సులోనే ప్రసవం నిర్వహించారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. డెలివరీ విజయవంతంగా నిర్వహించిన ఈఎంటీ లక్ష్మణ్, అంబులెన్స్ పైలట్ రాము సేవలను శైలజ కుటుంబ సభ్యులు అభినందించారు. అనంతరం తల్లి, శిశువును చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**లింగంపేట్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

లింగంపేట్ మండలం ముస్తాపూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ రాధా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో వార్డులో ఎన్ఆర్జీఎస్ పథకం ద్వారా రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముస్తాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాధా అన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములుగా చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం

**నిజామాబాద్ రూరల్–సిరికొండ, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

జాతీయ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏఈ చంద్రశేఖర్ అధ్యక్షతన సిరికొండ సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి ముఖ్య అతిథిగా హాజరై విద్యుత్ శాఖ సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో లైన్‌మెన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత భద్రత ప్రతి పౌరుని బాధ్యత అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ గంగారం, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




## వికసిత భారత్ యువ పార్లమెంట్ జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు రేపు

**కామారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

పట్టణంలోని ఆర్.కె డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో "వికసిత భారత్ యువ పార్లమెంట్" జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలను మార్చి 5, 2026న నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేరా యువభారత్ జిల్లా యువ అధికారి శైలీ బెల్లాల్, తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అంజయ్య, కళాశాల సీఈవో డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత భారత్ యువ పార్లమెంట్ జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలకు "మై భారత్" పోర్టల్‌లో నమోదు చేసుకున్న 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. జి స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు







# రంగుల్లో మునిగి..ఆనందంలో తేలి

**ఎడపల్లి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఎడపల్లి మండలంలోని ఏఆర్పి క్యాంపులో బుధవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే యువకులు, మహిళలు, చిన్నారులు రంగులు పూసుకుంటూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



### గడ్డమీద తండాలో..

**నిజామాబాద్ రూరల్–సిరికొండ, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలం కొండాపూర్ ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డమీద తండాలో హోలీ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. గిరిజన జన సమితి జిల్లా అధ్యక్షుడు (నిజామాబాద్) కార్యక్రమానికి హాజరై గ్రామస్తులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక ఐక్యతకు పండుగలు వేదికలుగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయక్ కర్బారి జి. బాల్ రాజ్ నాయక్, బి. బద్య కర్బారి, గ్రామ ఉపసర్పంచ్ జి. రవి నాయక్, జి. బాల్ కిషన్ నాయక్, యువత తదితరులు పాల్గొన్నారు.

### చందాయిపేటలో ..

**చేగుంట, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన హోలీ వేడుకలు వైభవంగా సాగాయి. గ్రామంలో ఐక్యతకు నిదర్శనంగా పండుగ సంబరాలు కొనసాగాయి. 2006 నుంచి 2026 వరకు సేవలందించిన మూడు తరాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ప్రత్యేకంగా హాజరై గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వారి కలయిక గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం నుంచే చిన్నారులు, యువత గుంపులుగా చేరి రంగులతో సందడి చేశారు. డీజే సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కన పెట్టి ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, మాజీ సర్పంచ్ బజారు లావణ్య జయరాం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆనందాస్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నాగరాణి నగేష్, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామస్తులు ఉత్సాహంగా పండుగ జరుపుకోవడం విశేషంగా నిలిచింది.



### ప్రెస్ క్లబ్ లో..

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

నిజామాబాద్ కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, అర్బన్ జర్నలిస్టులు, ఎడిటర్ అసోసియేషన్ సభ్యులు, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వాగ్మారే సుభాష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది హోలీ పండుగను కూడా ప్రెస్ క్లబ్‌లో కలిసి జరుపుకున్నామని పేర్కొన్నారు. నిజామాబాద్ జర్నలిస్టులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ బొబ్బిలి నరసయ్య మాట్లాడుతూ జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటూ అన్ని పండుగలను ఐకమత్యంతో జరుపుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రాజు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఈగల్ టీం ఆధ్వర్యంలో ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

మంచిర్యాల జిల్లా భీమారం గ్రామంలో ఈగల్ టీం ఆధ్వర్యంలో హోలీ పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. టీం సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై రంగులు చల్లుకుంటూ, ఆటపాటలతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ముఖ్యంగా యువత ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈగల్ టీం ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక బంధాలను బలోపేతం చేస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. గ్రామస్తులంతా కలిసి పండుగను జరుపుకోవడం గ్రామంలో సంతోషకర వాతావరణాన్ని నెలకొల్పింది.

### భీమ్ గల్ మండలంలో..

**భీమ్ గల్ , మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించామని గ్రామ సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధని శంకర్ గౌడ్ తెలిపారు. భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్‌గల్ సహా పలు గ్రామాల్లో మంగళవారం హోలీ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం రాత్రి గ్రామాల్లో కోలాటం కార్యక్రమాలు నిర్వహించి పండుగను ఆరంభించారు. మంగళవారం ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నా పెద్దా, ఆడ మగ తేడా లేకుండా ఒకరికి ఒకరు రంగులు పూసుకుని డప్పుల సప్పులతో నృత్యాలు చేస్తూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధని శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల సంజీవ్, మాజీ వార్డు సభ్యుడు పిట్ల శ్రీనివాస్, నాయకులు విజయ్ రత్నం, సాయిబాబా, వేణు, గణేష్, అజయ్, అశోక్ పటేల్, మహిపాల్, బుమన్న, గ్రామ యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










## మోడీఫైడ్ సైలెన్సర్లు..
## రోడ్డు రోలరుతో తొక్కించిన పోలీసులు

**కామారెడ్డి, మార్చి 4 (ప్రజా శంఖారావం) :**

పట్టణంలో మాడిఫైడ్ సైలెన్సర్ల వల్ల పెరుగుతున్న శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. నిజాంసాగర్ చౌరస్తాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలకు చట్టవిరుద్ధంగా సైలెన్సర్లు మార్పు చేయడం నేరమని, అలాంటి వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనం నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే శబ్ద కాలుష్యాన్ని ఏమాత్రం సహించబోమని, ఇటువంటి తనిఖీలు



నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నరహరి, దేవునిపల్లి ఎస్ఐ రంజిత్, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఎల్లారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ సొంత స్థలంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని, ఆన్‌లైన్ పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని చెప్పి వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ వివరాలు వెల్లడించకూడదని తెలిపారు. అపరిచితులకు ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 24 గంటలలోగా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాంధీ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఆర్డీవోగా ప్రభాకర్

**ఎల్లారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**



ఎల్లారెడ్డి ఆర్డీవోగా ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయనను ఎల్లారెడ్డి ఆర్డీవోగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశమై పరస్పర పరిచయం చేసుకు న్నారు. సిబ్బంది ఆయనకు సన్మానం చేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్‌లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి రెవెన్యూ సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఇంతకు ముందు ఎల్లారెడ్డి ఆర్డీవోగా విధులు నిర్వహించిన పార్థ సింహారెడ్డి చేవెళ్లకు బదిలీపై వెళ్లారు.

## ఏకలవ్య పాఠశాల విద్యార్థి ఆత్మహత్య

**ఇందల్వాయి, మార్చి 4 ( ప్రజా శంఖారావం ):**



మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, లింగాపూర్ మండలం, మకమర్ది గ్రామానికి చెందిన బానోత్ రామ్ చరణ్ (15) ఇందల్వాయి ఏకలవ్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం రామ్ చరణ్ పాఠశాల ఆవరణలోని బాత్రూమ్ కిటికీకి నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాట్లు. మృతుడు కొంతకాలంగా మనస్థాపంతో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడి మృతిపై తండ్రి నూర్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాఠశాలలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ముదక్‌పల్లి శివారులో రోడ్డు ప్రమాదం : కేసు నమోదు

**నిజామాబాద్ రూరల్–ముగ్పాల్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

నిజామాబాద్ రూరల్ ముగ్పాల్ మండలం ముదక్‌పల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంచిప్ప గ్రామానికి చెందిన కొన్దేగల వెంకటేష్ ఫిర్యాదు మేరకు మార్చి 2 సాయంత్రం 7.30 గంటల సమయంలో ప్యాజియో ఆటో (టీఎస్ 02 యూఏ 6596)ను కమ్మరి రాజు నిర్లక్ష్యంగా రాంగ్ సైడ్‌లో నడుపుతూ కొన్దేగల శ్యామ్ నడుపుతున్న హీరో ప్యాషన్ ప్రో (ఏపీ 25 ఏఆర్ 3405)ను ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో శ్యామ్‌కు కుడి కాలి చిన్న వేలు, మోకాలి వద్ద గాయాలైనట్లు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ముగ్పాల్ ఎస్ఐ జడ్. సుష్మిత వెల్లడించారు.

# విద్యార్థి ఆత్మహత్యపై కలెక్టర్ సీరియస్

- ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహా నలుగురి సస్పెన్షన్
- మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**




ఇందల్వాయి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో రామ్ చరణ్ (15) అనే తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను కలెక్టర్ ఇలా త్రిపాఠి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ జరిపించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్ నేతృత్వంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ స్వామి, డాక్టర్ సైదా జైనబ్, ఫణి కుమార్, డాక్టర్ జ్యోతి ప్రాథమిక విచారణ నిర్వహించి నివేదిక సమర్పించారు. వారి నివేదిక ఆధారంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, హౌస్ మాస్టర్ కుల్దీప్ యాదవ్, హాస్టల్ వార్డెన్ విశ్వంబర్, మెస్ ఇంచార్జి ఆకాష్ యాదవ్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమై రామ్ చరణ్ ఆత్మహత్య ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామ్ చరణ్ బలవన్మరణానికి పాల్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో సమస్యలు సహజమని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు. ఆత్మహత్య ఆలోచనలు దరి చేరనీయకుండా చదువుపై ఏకాగ్రతతో దృష్టి సారించాలని హితవు పలికారు. క్రమశిక్షణతో ముందుకు సాగితే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. తప్పుడు నిర్ణయాలతో జీవితాన్ని ముగించుకోవద్దని, తల్లిదండ్రులకు వేదన మిగల్చవద్దని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్సీఓ గంగారాం నాయక్ తదితరులు ఉన్నారు.

## డ్రైవర్ల కంటి చూపుతో సురక్షిత ప్రయాణం



**కామారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

డ్రైవర్లకు మెరుగైన కంటి చూపు ఉంటేనే సురక్షిత ప్రయాణం సాధ్యమని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్–క్షేమంగా తిరిగి రండి" కార్యక్రమాన్ని ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రాజేష్ చంద్ర డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 136 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 20 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి పోలీస్ శాఖ తరపున చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మరణాలు క్రమంగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేదా సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం వంటి తప్పులు చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ నరహరి, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, ఎస్ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రాములవారి కల్యాణ తలంబ్రాలు ఇంటికే

**ఎల్లారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక సేవను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవానికి సంబంధించిన తలంబ్రాలు, ముత్యాలను భక్తుల ఇంటి వద్దకే చేరవేయనున్నట్లు టీజీఎస్ కార్గో నిజామాబాద్ ఇన్‌చార్జి డి.ఎం.ఈ కిషోర్ తెలిపారు. ఈ సేవపై అవగాహన కల్పించేందుకు ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవను పొందడానికి భక్తులు రూ.151 చెల్లించి సమీప టీజీఎస్ ఆర్టీసీ కార్గో కౌంటర్లలో, ముఖ్యంగా ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కల్యాణం అనంతరం తలంబ్రాలను కార్గో ద్వారా భక్తుల ఇంటికి పంపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, గాదె తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భద్రాద్రి రాములవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ త్రిఖండ సంఘటనా మంత్రి వినోద్, నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, ఇన్‌చార్జి–2 డి.ఎం.ఈ సాయికుమార్ పాల్గొన్నారు. సంప్రదించవలసిన నంబర్: 9347547652.




## వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం

**రాయికల్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధర్మకర్తలు చెన్నమనేని విష్ణువర్ధన్, వంశీవర్ధన్ సారథ్యంలో స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. పండితులు రామకృష్ణామాచార్యులు, కళ్యాణాచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వెంకటేశ్వర భక్త భజన మండలి ఆలపించిన భక్తిగీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్, ఉపసర్పంచ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సేవా సమితి సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**రాయికల్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

రాయికల్ లోని ప్రగతి ఉన్నత పాఠశాల అధినేతలు బాలె జయశ్రీ–శేఖర్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహించారు. నివేదిత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు వృద్ధులతో కలిసి హోలీ వేడుకలను నిర్వహించారు. రంగుల సందడి మధ్య విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా వృద్ధులు సంతోషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు స్వామి, గోపాల్ రెడ్డి, రమ్య, శ్రీలక్ష్మి, సమాజ సేవకులు ఎనుగందుల రమేష్, నివేదిత వృద్ధాశ్రమ పర్యవేక్షకుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## అందరి సహకారంతో అభివృద్ధి

**రాయికల్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

అందరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్ అన్నారు. పీఆర్టీయు టిఎస్ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన చైర్మన్ కటుకం రవీందర్, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, ఎలిగేటి లతిక అనిల్ ను బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి లో ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్, రాష్ట్ర కార్యదర్శులు గాజంగి రాజేశం, లక్కడి రాజరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నావేని మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, మండల శాఖ అధ్యక్షులు అంటాడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, మండల అసోసియేట్ అధ్యక్షులు కదుకుంట్ల అభయ్ రాజ్, కార్యదర్శి సిలివేరి రమేష్, ఊసకోల రాము, మాచర్ల మహేష్,బెజ్జంకి హరికృష్ణ,బూరుగు శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.





## ఆటో అదుపుతప్పి వ్యక్తి మృతి

**ఎడపల్లి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన టోకరి మహేందర్ ఎలక్ట్రిక్ ఆటో (టీజీ–16–టి–1334)లో కిరాయికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం వడ్డేపల్లి గ్రామ శివారులోని చిరువేణి మల్లేష్ వ్యవసాయ భూమి వద్ద గల డి–46 కాలువలోకి ఆటో అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మహేందర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న భార్య శోభ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు.

## ఆగి ఉన్న లారీని ఢీ కొని యువకుడి మృతి

**చేగుంట మార్చి 4 (ప్రజా శంఖారావం) :**




మెదక్ జిల్లా, చేగుంట మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసాయిపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. మాసాయిపేట మండలం పోతన్ పల్లి గ్రామానికి చెందిన బర్రె విజయ్ (35) తన బైక్‌పై తూప్రాన్ వెళ్తుండగా స్టేషన్ మాసాయిపేట వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుండి బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద సమాచారం అందుకున్న చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోతన్ పల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీపై విద్యార్థులకుఅవగాహన

**జుక్కల్ మార్చి 4 (ప్రజా శంఖారావం) :**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని మేనూర్ మోడల్ స్కూల్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులకు బుధవారం మద్నూర్ ఎస్సై మోహన్ రెడ్డి సైబర్ క్రైమ్ గురించి రోడ్డు సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని రోడ్డు సేఫ్టీ గురించి కూడా నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో పోలీస్ సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## అనాథ చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ

**కామారెడ్డి, మార్చి 4 (ప్రజా శంఖారావం):**

పట్టణ మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కామారెడ్డి మండలంలోని భవానిపేట్ శివారులో ఉన్న చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ చిన్నారులకు బుధవారం పుస్తకాలు, పెన్లు, డిక్షనరీలు మరియు పండ్లు పంపిణీ చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి శుభాకాంక్షల కోసం వచ్చే వారికి షాలువాలు, పూల బొకేలు ఇవ్వడం కన్నా నోట్‌బుక్స్, పెన్నులు వంటి ఉపయోగకరమైన వస్తువులు అందించాలని ఆమె సూచించిన విషయం తెలిసిందే. ఆ పిలుపుకు స్పందించిన దాతలు అందించిన విద్యా సామగ్రిని వెంటనే ఆశ్రమంలోని చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, "మానవ సేవే మాధవ సేవ" అని పేర్కొంటూ, సమాజ సేవలో దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు శోభన్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, బంగారు దేవదాసు, ఇటుకల శ్రీనివాస్, అక్షయ్, ప్రేమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో పోలీసులపై దాడి : నలుగురిపై కేసు నమోదు

**మెట్ పల్లి టౌన్ /కోరుట్ల,మార్చి4(ప్రజా శంఖారావం):**

కోరుట్ల పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి జరిగిన సంఘటన సంచలనం రేపింది.మంగళవారం రాత్రి కోరుట్ల హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి,కానిస్టేబుల్ గంగాధర్ పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.భీముని దుబ్బ ప్రాంతంలో కొంతమంది యువకులు డీజే పెట్టుకుని గట్టి శబ్దంతో డాన్స్ చేస్తున్నట్లు డయల్ 100 ద్వారా సమాచారం పోలీసులకు అందింది.సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు డీజే ఆపేసి అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు.అయితే అక్కడ ఉన్న గడల విజయ్,డీజే రమేష్,దినకర్,మహేందర్ అనే వ్యక్తులు పోలీసుల సూచనలను పట్టించుకోకుండా డాన్స్ చేసినట్లు తెలిపారు.ఈ క్రమంలో హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి సంఘటనను తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీస్తుండగా పై వ్యక్తులు ఫోన్ లాక్కొని కింద పడేశారని ఆరోపణలు ఉన్నాయి.ఫోన్‌ను తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ గంగాధర్‌ను కాలర్ పట్టుకుని నెట్టివేసి విధి నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## 6 న జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవం

**కామారెడ్డి, మార్చి 4 (ప్రజా శంఖారావం):**

ఈ నెల 6న జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవం జవహర్ నవోదయ విద్యాలయం, నిజాంసాగర్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు తప్పనిసరిగా పంపించాలని ఆయన సూచించారు. “వికసిత భారత్ – అందులో నా భాగస్వామ్యం” అనే అంశంపై వివిధ పోటీలు నిర్వహించి, జిల్లాలోనుంచి ఒక అమ్మాయి, ఒక అబ్బాయిని ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు వద్నగర్, గుజరాత్‌లో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ చదువుకున్న పాఠశాలను సందర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కావున ప్రతి పాఠశాల ఈ పోటీల్లో తప్పనిసరిగా ప్రాతినిధ్యం వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు.

## కాపర్ వైర్ దొంగల అరెస్ట్ అడ్డుకున్న వారిపై ఇనుపరాడుతో దాడి

**కామారెడ్డి, మార్చి 4 (ప్రజా శంఖారావం)**

పట్టణంలోని గొల్లవాడ సమీపంలో రాత్రి జరిగిన దొంగతనం ఘటన కలకలం రేపింది. మంగళవారం సుమారు రాత్రి 11 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కాపర్ వైర్ దొంగిలించి తరలిస్తుండగా స్థానికులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో రాజేష్, వినోద్, అశోక్ వారు వారిని ఆపి వివరాలు అడగగా, దుండగులు అకస్మాత్తుగా దాడికి దిగారు. ముందస్తు పథకం ప్రకారం తమతో తీసుకువచ్చిన ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసి ముగ్గురికి తలలకు తీవ్ర గాయాలు కలిగించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు పాల్పడిన నవీద్, ఇజాస్, వసీం, హజారుద్దీన్ అనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు పంపిందని పట్టణ సీఐ నరహరి తెలిపారు.



## సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ

**ఆర్మూర్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం నందిపేట్ మండలం వన్నెల్‌కే గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఏడబ్ల్యూపి నిధుల నుంచి రూ.13.50 లక్షలు మంజూరు చేయగా, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, స్థానిక శాసన సభ్యుడు పైడి రాకేష్ రెడ్డి సహకారంతో ఈ నిధులు అందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యా కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు భరత్ రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.




## ఆదర్శనగర్ లో హోలీ సంబరాలు

**ఆర్మూర్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లిలో గల ఆదర్శనగర్ లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు, పిల్లలు, పురుషులు ఒకరి ఒకరు రంగులు చల్లుకుంటూ హ్యాపీ హోలీ అంటూ వీధిలోని ఇంటింటికి వెళ్లి హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డిష్ ప్రకాష్, 25 వార్డు కౌన్సిలర్ భూపేందర్, ఉపాధ్యక్షులు గోపి, కార్యదర్శి అరుణ్, క్యాషియర్ బాలరాజు, సౌడ రవి, శ్రావణ్, శ్యామ్, రాజు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక విజయవంతానికి కృషి చేయాలి

- **అధికారులతో సమీక్షలో నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక విజయవంతానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిదు దశల్లో అమలు చేయనున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ప్రజారోగ్యం, రోడ్డు భద్రతా చర్యలు, వివిధ వర్గాల సంక్షేమం, కల్తీ కల్లు మరియు మత్తు పదార్థాల నిరోధం, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, పీహెచ్‌సీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, మాతా–శిశు మరణాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా జనరల్ ఆసుపత్రి పనితీరులో స్పష్టమైన మార్పు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ కల్తీ ఆహార పదార్థాల నిరోధానికి ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. 14–15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. మార్చి 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో కలెక్టరేట్‌లో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్‌డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కల్యాణ లక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ ధృవీకరణ పత్రాల పంపిణీ



**కామారెడ్డి, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

కామారెడ్డి నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన సంక్షేమ కార్యక్రమాల్లో శాసన సభ్యుడు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. రామారెడ్డి మండలంలోని గ్రామాలతో పాటు అన్నారం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. మాచారెడ్డి, పల్వంచ, బీబీపేట, భిక్నూర్ మండలాల రైతు వేదికల్లో ఆయా మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. బీబీపేట మండల కేంద్రంలోని మాదాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామ రైతు వేదికలో కూడా లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కామారెడ్డి పట్టణం, మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విజయ్ హై స్కూల్‌లో ఘనంగా ఫేర్‌వెల్ వేడుక



**ఆర్మూర్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని విజయ్ హై స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థుల కోసం ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్ విద్యా సంస్థల అధినేత డా. అమృత లత హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ టి. కవితా దివాకర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ జి. రమాదేవి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు తమ విద్యాభ్యాస కాలంలోని అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి వారి భవిష్యత్ విజయాలను ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని ముగించారు.







## రామ్ నగర్ అభివృధి కమిటీ ఆధ్వర్యంలో హోలీ పండుగ

**ఆర్మూర్ మార్చి 4 (ప్రజా శంఖారావం) :**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 15 వ వార్డు రాంనగర్ లో రామ్ నగర్ అభివృధి కమిటీ ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా కామ దహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మనిషి లో ఉన్న అరిషడ్వర్గాలు అయినటువంటి కామ, క్రోధ, మోహ, లోభ, మధ, మత్స్యర్యాలని దహించి వేయాలని, ధర్మబద్ధంగా, నీతి నియమాలు పాటిస్తూ మన జీవితాన్ని రంగుల హరివిల్లుగా మార్చుకోవాలని, అదేవిధంగా ప్రతీ కుటుంబం ప్రకృతి సిద్ధమైన రంగులు (కలర్స్) వాడుతూ సుఖ సంతోషాలతో హోలీ పండగ జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షులు, విద్య లోటస్ పాఠశాలల అధినేత విద్య ప్రవీణ్ పవార్, మాజీ కౌన్సిలర్ గంగమోహన్ చెక్రు, దమంకర్ రవీందర్, గోపి కిషన్ శర్మ, బరాడ్ నీరజ్, లింబగిరి స్వామి, కర్తన్ రవి, గోవింద రాజ స్వామి, కిషోర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ఏసీపీ కి హోలీ పండుగ శుభాకాంక్షలు

**ఆర్మూర్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఏసిపి కార్యాలయంలో బుధవారం రోజు హోలీ పండుగ సందర్భంగా ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ని కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు. ఏసిపి ని కలిసిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు జెస్సు అనిల్ కుమార్, బిజెపి ఆర్మూర్ పట్టణ ఉపాధ్యక్షులు దొండి ప్రకాష్, పులి యుగంధర్, మిరియాల్కర్ కిరణ్, బీజేవైఎం ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు ఉదయ్ గౌడ్, జుగ్గే ప్రసాద్, గుజరాతి దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## రజక సంఘం ఆధ్వర్యంలో 30 వార్డ్ కౌన్సిలర్ కు సన్మానం

**ఆర్మూర్, మార్చి 4 (ప్రజాశంఖారావం):**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని రజక సంఘంలో రజక సంఘం అధ్యక్షుడు చౌదరి పోషన్న ఆధ్వర్యంలో 30వ వార్డులో ఇటీవల బిఆర్ఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్ గా గెలుపొందినటువంటి 30 వార్డ్ కౌన్సిలర్ గుంజాల పృథ్వీరాజ్, కు రజక సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. తర్వాత మిఠాయిలుపంచారు. ఈ కార్యక్రమంలో పెద్దమనుషులు కొండూరు నరేష్, మీర నగేష్, పేర్కిట్ గంగాధర్, మాక్లూర్ ప్రసాద్, చల్లగారిగే ధరంపాల్, దత్తాపురం రాజు, రామడి గోపి, సంఘం సభ్యులు మీర శ్రావణ్, రబిత్, అభి తదితరులు పాల్గొన్నారు.

